పటిష్ట ప్రణాళికతో ఎన్నికల నిర్వహణ

- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ఫ్లయింగ్ స్క్వాడ్‌తో నిరంతర నిఘా
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి



సాక్షి ఇంటర్వ్యూ

డాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, దక్షిణ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి తెలిపారు. మరికొద్ది రోజుల్లో నిర్వహించనున్న సాధారణ ఎన్నికలను నియోజకవర్గంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు అతిక్రమించకుండా నిరంతర నిఘా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక కేంద్రాలు, హోం బ్యాలెట్ తదితర అంశాలను ఆయన తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

చురుగ్గా ఏర్పాట్లు

ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తాం. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయి.

ఇదే మా టీమ్

నియోజకవర్గంలో నాతోపాటు జోన్–4 జోనల్ కమిషనర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా ఎన్నికల నియమ నిబంధనలను ఉలఘించినట్లు సమాచారం అందిన వెంటనే ఆ బృందాలు వెళ్లి తనిఖీలు చేపడతాయి. ప్రతీ బృందంలో 8 మంది సిబ్బంది ఉంటారు. ఈ బృందాల్లో హెచ్‌సీలు ఇద్దరు, ఏఆర్ గార్డులు ఇద్దరు, సాంకేతిక నిపుణులు ఇద్దరు ఉంటారు. వీరిని ఇద్దరు మెజిస్టీరియల్ అధికారులు పర్యవేక్షిస్తారు. ఈ బృందాలు నిరంతరం నిఘా నిర్వహిస్తాయి.

ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ

నియోజకవర్గంలో ఎన్నికల నియమాలు ఉల్లంఘించకుండా మరింత నిఘా పెట్టాం. దీని కోసం ఐదు బృందాలను నియమించాం. వాటిలో నిబంధనలు పరిశీలనకు ముగ్గురు సభ్యులతో కూడిన రెండు బృందాలు, ఐదుగురు సభ్యులతో కూడిన స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు మూడు ఉన్నాయి. ఆయా బృందాలు ర్యాలీలు, సభలు, సమావేశాలకు వీడియోలు, ఫొటోలు తీసి పరిశీలిస్తుంటారు. వాటికి అయ్యే ఖర్చు లెక్కకడతాయి.

స్టిక్కర్లు తొలగించాల్సిందే

ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలతో పాటు ఎక్కడా పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లు అంటించకూడదు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు తదితర మోటార్ వాహనాలపై అభ్యర్థుల ఫొటోలు ఉండకూడదు. అలాంటి వాహనాలను వెంటనే సీజ్ చేస్తాం. పార్టీల కార్యాలయాల ముందు కటౌట్లు ఉండకూడదు. పార్టీ కార్యాలయం లోపల ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల గోడలపై స్టిక్కర్లు, వాటి ఆవరణలో కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు జెండాలు ఉన్నట్‌లైతే 24 గంటల్లోగా తొలగించాలి. ప్రైవేట్ స్థలాల్లో ఉన్న గోడలపై స్టిక్కర్లు, వాటి ఆవరణలో కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు జెండాలు ఉన్నట్లయితే 72 గంటల్లో తొలగించాలి.

2,12,783 మంది ఓటర్లు

దక్షిణ నియోజకవర్గంలో 2,12,783 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,04,497 మంది పురుషులు కాగా, మహిళలు 1,08,254 మంది ఉన్నారు. 32 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరంతా మే 13న జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

235 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. బూత్ లెవెల్ సిబ్బందితో పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేయిస్తున్నాం.

ఇంటి నుంచే ఓటు

నియోజకవర్గంలో 2,908 మంది ఓటర్లకు హోం బ్యాలెటింగ్ (ఇంటి నుంచే ఓటు) అవకాశం ఉంది. వీరిలో 1557 మంది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు సర్వీసింగ్ (ఆర్మీ, ఇండియన రైల్వే, ఆల్ ఇండియా రేడియో తదితర వాటిలో పనిచేస్తున్నవారు) ఓటర్లు ఉన్నారు. వీరిలో 858 మంది పురుషులు కాగా, 696 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అలాగే 85 ఏళ్లు దాటిన వారు 1351 మంది ఉండగా 660 మంది పురుషులు, 695 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఐదు రోజుల్లోగా వారంతా హోం బ్యాలెటింగ్ కోసం ×12 డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వారి ఇంటికి నలుగురు అధికారులతో కూడిన బృందాన్ని పంపించి, హోం బ్యాలెటింగ్‌కు వారు అర్హులో, కాదో నిర్ధారించి, తదుపరి చర్యలు చేపడతాం. పోలింగ్‌కు రెండు, మూడు రోజుల ముందే వారికి ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తాం. వారు వేసిన ఓటును భద్రపరుస్తాం.

ముందస్తు అనుమతి తప్పనిసరి

అభ్యర్థుల తరపున రాజకీయ నాయకులు ఏర్పాటు చేయదలచిన సభలు, సమావేశాలకు ముందుగా అనుమతులు తీసుకోవాలి. అనుమతి తీసుకోకుండా ఎలాంటి సభలు నిర్వహించకూడదు.

ప్రత్యేక కాల్ సెంటర్

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినవారిపై ఫిర్యాదులు స్వీకరించడానికి జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేశాం. నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై 0891–2562424, 2567474 నంబర్‌కు ఎవరైనా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఈ నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది.

సమస్యాత్మక కేంద్రాలపై స్పెషల్ ఫోకస్

నియోజకవర్గంలో ప్రస్తుతానికి రెండు సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలు గుర్తించాం. వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నాం. ఆ కేంద్రాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తున్నాం.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తా..



రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని శ్రీవత్సవ్ ఈ సందర్భంగా తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనేందుకు రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

క్లాప్ వాహనాల్లో పూర్తి స్థాయిలో చెత్త తరలించాలి



పాత పోస్టాఫీసు వద్ద క్లాప్ వాహనాల్లో చెత్తను పరిశీలిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

- జోన్–4 జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ: జీవీఎంసీ క్లాప్ వాహనాల్లో వార్డుల నుంచి పూర్తి స్థాయిలో చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలని జోన్–4 జెడ్సీ పి.వి.వి.డి.ప్రసాదరావు సూచించారు. జోన్ పరిధిలోని 28, 30, 39 వార్డుల్లో గురువారం పర్యటించిన ఆయన ముందుగా క్లాప్ వాహనాలను పరిశీలించారు. ఉదయం 6 గంటలకే వార్డుల్లో ఇళ్ల ముందు క్లాప్ వాహనాలు ఉండాలన్నారు. ఈ వాహనాల్లో 600 కేజీల కంటే తక్కువ చెత్తను తీసుకువెళ్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వార్డులో కాలువలు పరిశీలించిన ఆయన ప్రజలతో మాట్లాడారు. వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రహదారుల పక్కన చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



39వ వార్డులో బీఎల్‌వోతో మాట్లాడుతున్న ఏఆర్వో ప్రసాదరావు

జగదాంబ: దక్షిణ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం అసిస్టెంట్ ఎన్నికల అధికారి పి.వి.వి.డి.ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్ లెవల్ సూపర్‌వైజర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్‌తోపాటు పోలింగ్ సమయంలో ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డికంచరపాలెం బాపూజీనగర్‌లో తన అన్న సురేష్‌రెడ్డితో కలిసి నివసిస్తున్న బోర సుధాకర్‌రెడ్డి(40) కూలి పనులు చేస్తుంటాడు. వివాహం కావట్లేదని, తరచూ అందరితో గొడవలు పడుతుండేవాడు. గురువారం ఉదయం పనికి వెళ్లడానికి ఎంతకీ కిందకి రాకపోవడంతో.. అతడి అన్నయ్య మేడ మీద గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందడాన్ని గుర్తించారు. అతడి అక్కకి ఫోన్ చేశారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి అక్క జి.నిర్మల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భారత్ వికాస్ పరిషత్ మహిళా కార్యవర్గం ఎన్నిక



ఝాన్సీ లక్ష్మీభాయ్ మహిళా శాఖ కొత్త కార్యవర్గ సభ్యులు, బీవీపీ ప్రతినిధులు

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీ లక్ష్మీబాయ్ మహిళా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ప్రాంగణంలోని పరిషత్ కార్యాలయంలో జరి గింది. 2024–25 సంవత్సరానికి జరిగిన ఎన్నిక లో అధ్యక్షురాలిగా పి.షర్మిల, కార్యదర్శిగా డాక్టర్ సి.నిర్మలాదేవి, కోశాధికారిగా వి.విభవ సుందరి ఎన్నికయ్యారు.పరిషత్ ప్రాంత్ స్థాయి ప్రతినిధి వంకాయల సన్యాసిరాజు, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, మీడియా ఇన్‌చార్జి ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ మెన్ పోటీల్లో స్పైక్‌ను బ్లాక్ చేస్తున్న ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌ఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్ గురువారం రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభమైంది. మెన్‌లో ఎనిమిది జట్లు, వుమెన్‌లో నాలుగు జట్లు నాకవుట్ కమ్ లీగ్ పద్ధతిలో తలపడుతున్నాయి. ఈ పోటీలను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన జట్లను అభినందించారు. రైల్వే స్టేడియంలో పూర్తిస్థాయి క్రీడా వసతులున్నాయన్నారు. ఈ నెల 24తో ముగియనున్న టోర్నీని ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించనున్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్, ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్ బాతి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో అటవీ దినోత్సవం



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, గ్రీన్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మొక్కలు నాటి విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు. విజేతలు ఎస్.కిరణ్మయి, బి.దాలమ్మలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ జె.లావణ్య, రసాయన శాస్త్ర విభాగాధిపతి బి.ఎస్.అనూష, జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ శశికళ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఐపీఆర్ఎస్ అడహక్ రీజనల్ అడ్వైజరీ కమిటీలో 'పల్లి'



పల్లి నాగభూషణరావు

డాబాగార్డెన్స్: భారత ప్రభుత్వంచే కాపీ రైట్ సొసైటీగా నమోదైన ఇండియన్ పెర్ఫార్మింగ్ రైట్ సొసైటీ(ముంబై) ఇటీవల దక్షిణ భారతదేశంలో తెలుగు భాషకు సంబంధించి ఐపీఆర్ఎస్ అడహక్ రీజనల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసింది. ఏడుగురు ప్రముఖులు గల ఈ కమిటీలో వ్యావహారిక గీత రచయిత, స్వరకర్త, గాయకుడు పల్లి నాగభూషణరావుకు సభ్యుడిగా స్థానం కల్పించారు. కమిటీ సభ్యుల్లో హైదరాబాద్‌కు చెందిన రబీంద్ర ప్రసాద్ పట్నాయక్, అర్రం వేణుగోపాల్, కృష్ణకాంత్ గుండగాని, భాస్కరభట్ల రవికుమార్, ఎంఎం శ్రీలేఖ, కీర్తితో పాటు విశాఖకు చెందిన పల్లి నాగభూషణరావు ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం డిమిరయా గ్రామంలో జన్మించిన పల్లి తన సహోధ్యాయుడైన బిన్నాల నరసింహమూర్తితో కలిసి శ్రీమాతా స్టూడియోను విశాఖలో స్థాపించి, ఎంతో మంది సామాన్య కళాకారులను సెలబ్రిటీలుగా చేశారు. అన్ని కళా రూపాలను యూ ట్యూబ్ చానళ్లలో నిక్షిప్తం చేసి, విశ్వాత్మక కళా సంగ్రహ వేదికను తయారు చేశారు పల్లి నాగభూషణరావు.

24న మెగా రక్తదాన శిబిరం

సీతంపేట: వాసవీ క్లబ్ వాల్తేర్ కపుల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 24న శంకరమఠం రోడ్‌లోని వీ డెంటల్ హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్లను గురువారం హాస్పిటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా రక్త నిధి కొరత తీర్చడానికి మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. వాసవీ వాల్తేర్ కపుల్స్ కోశాధికారి కె.రామకృష్ణ మాట్లాడుతూ మేము సైతం అనే నినాదంతో ఈ నెల 24న నగరంలోని నాలుగు కేంద్రాల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని వీ డెంటల్ హాస్పిటల్, అంబికాబాగ్‌లోని అమ్మా బ్లడ్ బ్యాంక్, మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ, ఎంవీపీ కాలనీ దయా హాస్పిటల్‌లో శిబిరాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.శ్వేత, డాక్టర్ ఇ.శ్రీవిద్య, కె.మేరీ, కె.తులసి, కె.రాజ్యలక్ష్మి, జి.ప్రశాంతి పాల్గొన్నారు.

డాక్‌యార్డ్‌లో విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి

ఏయూ క్యాంపస్: నావల్ డాక్‌యార్డ్‌లో ఏయూకు చెందిన 12 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ని పూర్తి చేశారు. ఫిబ్రవరి 14 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరిగిన ఇంటర్న్‌షిప్‌లో పాల్గొని పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) కమోడోర్ సంజయ్‌కుమార్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. ఇనుస్ట్రుమెంటేషన్ విభాగ విద్యార్థి శ్రీరామ్ ఫణీంద్ర శ్రీసాయి బెస్ట్ ఇంటర్న్‌గా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆచార్య కె.రాంజీ, ఆచార్య ప్రసాద్, సమన్వయకర్త ఆచార్య గిరి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్‌పై ప్రచారం

ఏయూ క్యాంపస్: ఈ నెల 23వ తేదీ రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు ఎర్త్ అవర్‌ని పాటించి విజయవంతం చేయాలని వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ప్రోగ్రాం అధికారి హని సెలజ్ అన్నారు. గురువారం ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హని సెలజ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నగరాలలో ఒక గంట సమయం విద్యుత్ ఉపకరణాల వినియోగం నిలిపివేయాలని సూచించారు. ఢిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, విశాఖలో పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ ధరిత్రీ గంట(ఎర్త్ అవర్)ని జయప్రదం చేయడంలో యువత భాగస్వామ్యం అవసరమన్నారు.

ప్రచారానికి 'సిద్ధం' కండి

- 24న పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి మోత మోగిద్దాం
- సేవ చేస్తున్న ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ 'దక్షిణ' ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపు



37వ వార్డు కమిటీ సమావేశంలో కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, నాయకులతో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లోని వాసుపల్లి కార్యాలయంలో గురువారం 37వ కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు నాయకులు, బూత్ అధ్యక్షులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్టు చెప్పారు. అంతా సమన్వయంతో దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడానికి పనిచేయాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో పేదలకు జరిగిన మేలు వివరించాలని చెప్పారు. 70 వేల గడపలున్న నియోజకవర్గంలో 26,500 మందిని అర్హులుగా గుర్తించి, వారికి సెంటు భూమి, టిడ్కో, హుద్‌హుద్, స్కీం ఇళ్లు కట్టించి ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన వారికి కచ్చితంగా న్యాయం చేయిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 3 ఆస్పత్రులు, పలు వార్డుల్లో సామాజిక భవనాలు, పాతనగరం జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణతోపాటు పలు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి చేశామన్నారు. ఏళ్ల తరబడి కలగా మారిన సత్యనారాయణస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు వేయించగలిగామని, అవినీతికి తావులేకుండా రూ.2.60 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి పంపించారన్నారు. ఏ సర్టిఫికెట్ అయినా, పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా, ఏ ప్రభుత్వ పనులకైనా వార్డు సచివాలయాల్లోనే జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో 2.60 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యేగా సొంత నిధులతో మనం చేస్తున్న సేవలు కూడా ప్రజలకు వివరించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో సాధ్యం కానిది ఏదీ లేదని, మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటే ప్రజలు, రాష్ట్రం సుభిక్షంగా ఉంటాయని వాసుపల్లి చెప్పారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన

సీతమ్మధార: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరావు నేతృత్వంలో రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ జిల్లాకు సంబంధించి 13 మంది సచివాలయ కార్యదర్శులకు పోస్టల్ బ్యాలెట్‌పై పలు సూచనలిచ్చారు. 85 ఏళ్లు దాటిన వారు, ఫిజికల్ హ్యాండీక్యాప్డ్, కోవిడ్ బాధితులకు సంబంధించి ఇంటి వద్దకు వెళ్లి 12డీ అప్లికేషన్ నింపించి వారి ఓటును పోస్టు ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు ప్రారంభం

ఎంవీపీ కాలనీ: స్థానిక గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో మూడు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. బయో ఇన్ఫర్‌మేటిక్స్ అంశంపై అధ్యాపకుల అభ్యున్నతికి ఆన్‌లైన్ విధానంలో ఈ సదస్సును కళాశాల మైక్రోబయాలజీ విభాగం, కేరళకు చెందిన ఎక్స్‌ప్లోజెన్ బయో ఎక్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఆదికవి నన్నయ్య వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆచార్య రాజ గణపతి, ఆచార్య పి.శశిభూషణరావు తదితరులు ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమంలో పాల్గొని జీవావరణ రంగంపై వారి విశ్లేషణలు, అధ్యాయనాలు వెల్లడించారు.

పోలీస్ శాఖకు 120 బీపీ మెషీన్ల అందజేత



నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌తో జీతో సేవా సంస్థ ప్రతినిధులు

విశాఖ సిటీ: నిత్యం ఒత్తిడితో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సూచించారు. సీపీ సమావేశ మందిరంలో జీతో సేవా సంస్థ రూ.1.6 లక్షలు విలువ చేసే 120 బీపీ మెషీన్లను పోలీస్ కమిషనర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఈ బీపీ మెషీన్లను ట్రాఫిక్ అవుట్‌పోస్టులలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వీటి సాయంతో డ్రైవర్లు బీపీ తనిఖీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జీతో సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ–1 వి.ఎస్.మణికంఠ, డీసీపీ–2 ఎం.సత్తిబాబు, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, జీతో సేవాసంస్థ ప్రతినిధులు ఆశిష్ ధరివాల్, నికేష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పరిరక్షణకు పోరాడతాం

కంచరపాలెం: కార్మికుల పక్షపాతిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి పరిరక్షణకు పోరాడతామని ఐఎన్‌డీడబ్ల్యూఎఫ్ జనరల్ సెక్రటరీ ఆర్ శ్రీనివాసరావు అన్నారు. కంచరపాలెం పరిధి మేఘాద్రిపేటలోని కళా మేఘా ఓపెన్ ఆడిటోరియంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఓపీఎస్ సాధన, 8వ పే కమిషన్ ఏర్పాటు, పూర్వ నేవెల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ ఇంక్రిమెంట్లు, ఓటీ, హెచ్‌ఆర్‌ఏ, పలు సమస్యలపై ఆయన మాట్లాడారు. ఓపీఎస్ సాధన కోసం ఆలిండియా కార్మిక సంఘాలన్నీ ఏకతాటిపై పోరాటం చేస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఐఎన్‌సీఈయూ అధ్యక్షుడు బి.భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.చిన్నారావు, ఎన్‌డీ జీఎస్ ఎస్ మారయ్య, డీజీఎన్‌పీ అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరమ్ బ్లాక్ ప్రారంభం



వీరమ్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ హరికుమార్

సింథియా: విశాఖపట్నంలోని నౌశక్తినగర్‌లో డీఎస్సీ సిబ్బంది (492 మంది పురుషులు) కోసం వసతి భవనం వీరమ్ బ్లాక్‌ను గురువారం నేవల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్ హరికుమార్, పీవీఎస్ఎమ్, ఏవీఎస్ఎమ్, వీఎస్ఎమ్ ప్రారంభించారు. వీరమ్ బ్లాక్‌లో బయోగ్యాస్ ప్లాంట్‌తో కూడిన కుక్ హౌస్, వ్యాయామశాల, వినోద పరికరాలు, గ్రంథాలయ సౌకర్యాలతో కూడిన అత్యాధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.